

## రంజాన్ వేళలు

ఇఫ్తార్
సా. 6:20 (మంగళవారం)
సెహరీ
ఉ. 5:05 (బుధవారం)



సీజనల్ వ్యాధుల పట్ల

## అప్రమత్తంగా ఉండాలి

కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ 2

18వ వసంతంలోకి..
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
మంగళవారం 4 మార్చి 2025 పేజీలు 8



నియోజకవర్గంలో..

# భారీగా తవ్వకాలు

### రాత్రి పగలు తేడా లేకుండా బుసక, మట్టి అక్రమ తోలకాలు

- మండలి మాటలను పట్టించుకోని అధికారులు
- గత పదిరోజులుగా నాగాయలంక మండలంలో ఆగని తవ్వకాలు

**అవనిగడ్డ మేజర్‌న్యూస్ :** నియోజకవర్గంలో భారీగా బుసక, మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా రెవెన్యూ సిబ్బంది కనుసన్నలలోనే అక్రమతవ్వకాలు జరుగుతున్నాయని ప్రజలు బహిరంగంగా పేర్కొంటు న్నారు. నాగాయలంక మండలంలోని గణపేశ్వరం, పుల్లయ్యగారి దిబ్బ, సంఘమేశ్వరం, ఉపకాలి వంటి ప్రాంతాల నుండి ట్రాక్టర్లు, ట్రిప్పర్లతో రాత్రి. పగలు తేడాలేకుండా అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. తవ్వకాల సమయంలో 2లో



బాల్య వివాహ రహిత సమాజం కోసం

# సమష్టి కృషి అవసరం

- బాల్య వివాహాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కల్పించాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మార్చి 3, మేజర్ న్యూస్ :** బాల్య వివాహ రహిత సమాజం కోసం సమష్టిగా కృషిచేయాల్సిన అవసరముందని, బాల్య వివాహాల దుష్పరిణామాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా విజయవాడ సివిల్ కోర్టు సమీపంలోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, చిల్డ్రన్ హోం ప్రాంగణంలో బాల్య వివాహాల నిర్మూలనపై నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సిగ్నేచర్ క్యాంపయిన్‌ను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహం అనేది ఓ సాంఘిక దురాచారమని, అది బాలికలను విద్య, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం కలిగించడమే కాకుండా బంగారు భవిష్యత్తును దూరం చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో సమాజంలోని ప్రతిఒక్కరూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా వీలైనంత మేర ప్రయత్నం చేయాలన్నారు. బాల్య వివాహాలను అడ్డుకునేందుకు చేసిన మిగతా 2లో...

మహిళా శక్తిని, యుక్తిని చాటిచెప్పేలా...

# మహిళా దినోత్సవ వేడుకలు

- సరైన కార్యాచరణతో ప్రత్యేక కార్యక్రమాలకు సిద్ధంకండి
- సమన్వయ శాఖల అధికారులకు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశాలు



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మార్చి 3, మేజర్ న్యూస్ :** మహిళా శక్తిని, యుక్తిని చాటిచెప్పేలా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల నిర్వహణకు అధికారులు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల సన్నద్ధతపై చర్చించేందుకు కలెక్టర్ లక్ష్మీశ సోమవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలతో సహా వివిధ రంగాల్లో మహిళామణులు సాధించిన విజయాలను గుర్తించి, మిగతా 2లో...

(మొదటిపేజీ తరువాయి)



## నియోజకవర్గంలో భారీగా బుసక, మట్టి తవ్వకాలు

ఆయా గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫోన్ చేసినా స్పందించటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ అధికారులకు ఇప్పటికే అక్రమ తవ్వకాలను నిరోధించాలని చెప్పినప్పటికి ప్రయోజనం శూన్యం. నాగాయలంక మండలంతోపాటు అవనిగడ్డ మండలంలోని పాతయడ్లంక కృష్ణా నది సమీపం నుండి అక్రమ తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. గత సంవత్సరం అక్రమత్రవ్వకం జరిగిన ప్రాంతాలను మైనింగ్ అధికారులు ఇటీవలే వచ్చి తనిఖీలు నిర్వహించారు. ఇంత జరుగుతున్నా తవ్వకాలు మాత్రము నిలువరించలేకపోతున్నారు. మండలి బుద్ధప్రసాద్ నియోజకవర్గ శాసనసభ్యులుగా ఎన్నికైన నాటినుండి అక్రమతవ్వకాలు సహించేదిలేదని ఖరాఖండిగా చెప్పినప్పటికి రెవెన్యూ, పోలీస్ సిబ్బంది మాత్రం అక్రమ తవ్వకాలను చూసీ చూడనట్లుగా వదిలివేయటంతో బుద్ధప్రసాద్‌కు, కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. అక్రమ తవ్వకాలు చేసేవారు కూటమి ప్రభుత్వ నేతలతో పాటు ప్రతిపక్ష వైసిపి నేతలు కూడా ఉన్నారు. వీరిఇరువురి కలయికతో అక్రమతవ్వకాలకు అంతులేకుండా పోతుంది. ఎన్నికల కోడ్ రాకముందు వరకు గ్రామలలోని సిసి రహదారుల అభివృద్ధి పేరుతో ఇసుక, బుసక అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లింది. గత మూడు రోజులనుండి నాగాయలంక మండలం సంఘమేశ్వరంలో అక్రమ మట్టిని కొండలు తలపించే విధంగా డంపింగ్ చేస్తున్నారు. ఇప్పటికైనా శాసనసభ్యులవారి చొరవతో అధికారులు అక్రమ మట్టి, బుసక తోలకం దారులను నివారిస్తారో లేదో వేచి చూడాలి.

### మహిళా శక్తి,ని, యుక్తిని చాటిచెప్పేలా..

## మహిళా దినోత్సవ వేడుకలు

(మొదటిపేజీ తరువాయి)

గౌరవించేందుకు.. వారిని స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది సమగ్రాభివృద్ధి దిశగా ముందడుగు వేసేలా ప్రోత్సహించేందుకు ఏటా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ వేడుకలను విజయవంతం చేసేందుకు గ్రామీణాభివృద్ధిబీ పురపాలక, పట్టణాభివృద్ధి, పరిశ్రమలు, మహిళా శిశు సంక్షేమ శాఖ, వ్యవసాయం.. ఇలా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల వారీగా మహిళా కేంద్రీకృత కార్యక్రమాల నిర్వహణకు సిద్ధం కావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యక్రమాల చేయూతతో పారిశ్రామికవేత్తలుగా రాణిస్తున్న మహిళామణులతో స్ఫూర్తిదాయక ప్రసంగాలు ఏర్పాటు చేయాలన్నారు. అభివృద్ధి పథంలో నడుస్తున్న స్వయం సహాయక సంఘాలు, వాటి సభ్యుల ను గుర్తించాలన్నారు. పీఎం ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎం ఈజీపీ), పీఎం విశ్వకర్మ యోజన వంటి ప్రస్తుతం అమల్లో ఉన్న పథకాల ద్వారా రుణాల మంజూరు పత్రాలు అందించేందుకు చర్యలు తీసుకోవాల న్నారు బ్యాంకు లింకేజీ రుణాలు, ఉన్నతి (పీఎం అజయ్), లఖ్‌పతి దీదీ తది తర కార్యక్రమాలకు సంబంధించి ఆర్థిక సహాయ పంపిణీ కార్యక్రమాలకూ ఏర్పాటు చేయాలన్నారు. మహిళా సాధికారతను ప్రతిబింబించేలా వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇప్పటికే గ్రౌండింగ్ అయిన యూనిట్లు ఆర్థికంగా ప్రగతి పథంలో పయనించేందుకు చేయిపట్టి నడిపించేలా సరైన మార్గనిర్దేశనం అవసరమన్నారు. మహిళల భద్రత కూడా అత్యంత ప్రాధాన్య అంశం కాబట్టి.. ఆ దిశగా వినూత్న ఆలోచనలతో కార్యక్రమాల అమలుకు చొరవతీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. స్వీయ రక్షణపై మహిళలకు అవగాహన కల్పించే కార్యక్రమాలపైనా దృష్టిసారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, పీవో-యూసీడీ వెంకటరత్నం, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, ఎల్‌డీఎం కె.ప్రియాంక, డీఐపీఆర్‌వో యు.సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

### బాల్య వివాహ రహిత సమాజం కోసం సమష్టి కృషి అవసరం

చట్టాలు, ప్రభుత్వాలు అమలుచేస్తున్న కార్యక్రమాలు, విధానాల పటిష్ట అమల్లో మహిళాభివృద్ధి, విద్య, వైద్య ఆరోగ్యం, పోలీస్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. బాలికల విద్యకు ప్రాధాన్య మిస్తూ.. ఆర్థికంతో పాటు అన్ని రంగాల్లోనూ సాధికారత దిశగా నడిపించేందుకు చేయిపట్టి చేయూతనివ్వాలని కలెక్టర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ అధికారి డి.శ్రీలక్ష్మి, నోడల్ అధికారి సీహెచ్ సాయిగీత, సీడీపీవోలు జ్యోత్స్న, జి.మంగమ్మ, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.రాజరాజేశ్వరరావు, అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** దోమల వ్యాప్తి, నీటి కాలుష్యం కారణంగా ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని తన చాంబర్లో ఆయన జిల్లాలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వైద్య ఆరోగ్య, మున్సిపల్, గ్రామీణ నీటి సరఫరా, జిల్లా పంచాయతీరాజ్, బీసీ, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. దోమల వ్యాప్తి వల్ల డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, నీటి కాలుష్యంతో వ్యాప్తి చెందే డయేరియా, కలరా వంటి వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. దీనికోసం ముందుగా డిఎం అండ్ హెచ్ ఓ అధికారితో కూడిన జిల్లాస్థాయి కమిటీ, అదేవిధంగా డిపిఓ, ఆర్డబ్ల్యూఎస్, డీఈవో, ఐసిడిఎస్ పిడి, మున్సిపల్ కమిషనర్లు, వెనుకబడిన తరగతులు, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులతో కూడిన మండల, గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి పనిచేయాలని సూచించారు. ఎక్కువ కాలం నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని డ్రైనేజీలలో మురుగునీరు సాఫీగా పారే విధంగా పూడికతీత, మరమ్మతులు చేపట్టాలన్నారు. పాత టైర్లు, పారేసిన కొబ్బరి చిప్పలు, మురికి గుంటలు ఉండే చోట్ల నీరు నిల్వ ఉండకుండా శుభ్రం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, విధిగా దోమల నివారణకు మందు పిచికారి చేయాలని సూచించారు. లీకైన తాగునీటి పైపులను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, ఓవర్ హెడ్ ట్యాంకులను నిత్యం శుభ్రపరచి క్లోరినేషన్, బ్లీచింగ్ చేయాలని సూచించారు. గ్రామాలలో సచివాలయ ఇంజనీరింగ్ అధికారులతో కలసి ఎమ్ ఎల్ హెచ్ పీ లు నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని, నీరు కలుషితమైనట్లు గుర్తిస్తే వెంటనే పైఅధికారులకు సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో కాచి మరిగించిన నీటిని మాత్రమే పిల్లలకు అందించాలని, వాటి పరిసర ప్రాంతాలలో మురుగునీరు నిల్వ ఉండకుండా శుభ్రం చేయాలన్నారు. అదేవిధంగా దోమలు వ్యాప్తి చెందకుండా బీసీ, సాంఘిక సంక్షేమం, రెసిడెన్షియల్ వసతి గృహాల పరిసర ప్రాంతాలలో పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన వసతి గృహాల కిటికీలకు మెష్ లను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడన్నా డయేరియా వంటి కేసులు నమోదైనట్లు తెలిస్తే తక్షణమే స్పందించి నివారణ చర్యలు చేపట్టాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో డిఎంహెచ్వో డాక్టర్ శర్మిష్ఠ, ఆర్డబ్ల్యూఎస్ అధికారి నటరాజన్, బీసీ వెల్ఫేర్ అధికారి రమేష్, డిపిఓ జే అరుణ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## పీవీ సునీల్ కుమార్ సస్పెన్షన్ ఎత్తివేయాలి

### గత ప్రభుత్వం పై కక్ష సునీల్ కుమార్ పై తగదు

### సిఐడి చీఫ్ సస్పెండ్ పై ప్రభుత్వం పునరా ఆలోచన చేయాలి

### కృష్ణాజిల్లా మాల మహానాడు నేత దోవా గోవర్ధన్ డిమాండ్.



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాని కి దళితులు అంటే చిన్నచూపు లేకపోతే డిజిపి కావలసిన పీవీ సునీల్ కుమార్ ను అకస్మాత్తుగా సస్పెండ్ చేయడం ఏంటని ప్రశ్నించారు. పారదర్శక పాలన అందిస్తామని ఒక దళిత ఐపీఎస్ అధికారి సిఐడి చీఫ్ సునీల్ కుమార్‌ను కక్షపూరితంగా రాష్ట్ర డిజిపి కాకుండా వ్యవహ రించడంలో ఆంతర్యం ఏంటో చెప్పాలని డిమాండ్ చేసారు. ఇది కచ్చితంగా దళితుల అణిచివేతకు నిదర్శనంగా భావిస్తున్నామన్నారు. సునీల్ కుమార్‌కు రాష్ట్రవ్యాప్తంగా దళిత సంఘాలు ప్రజలు అండగా ఉంటారని ఇలాంటి చర్యలు వెనక్కి తీసుకోకపోతే వారి వ్యతిరేకత చవిచూడక తప్పదన్నారు. కొందరు దోపిడీ రాజకీయ నేతల ఆరోపణలతో ఒక దళిత అధికారిని వేధించడం ఉన్నత పదవులు రాకుండా చేయడం ఓ సామాజిక వర్గంపై పెంచుకున్న కక్షగా భావిస్తున్నామన్నారు. దీనిపై దళిత వర్గాల్లో వ్యతిరేకత పెరగకముందే ప్రభుత్వం వెనుకకు తగ్గాలని సూచించారు.



## అవనిగడ్డలో ఘనంగా బాలయోగి వర్ధంతి

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దేశంలోనే అత్యున్నతమైన లోక్ సభకు తొలి దళిత స్పీకర్ గా సేవలందించి దేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేసిన కోనసీమ ముద్దుబిడ్డ, టీడీపీ నేత స్వర్గీయ జీఎంసీ బాలయోగి ఆదర్శనీయుడని పలువురు వక్కలు అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం జిఎంసి బాలయోగి వర్ధంతి కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈసందర్భంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశ లు కృషిచేసిన మహోన్నత వ్యక్తి బాలయోగిఅని సామాన్య కుటుంబంలో జన్మించి అత్యున్నతమైన లోక్ సభ స్పీకర్‌గా ఎదిగిన బాలయోగి జీవితం స్ఫూర్తిదాయకం రాష్ట్రానికి, దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ బాలయోగి ఆశయసాధనకు ప్రతిఒక్కరం పునరంకితం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ , తెలుగు యువత అధ్యక్షులు మేడికొండ విజయ్, మెగావత్ గోపి, నీల మనోహర్ ,వెంకట సుబ్బారావు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.

# ఔట్ ఫాల్స్ స్లూయిజులు నిర్మించాలి



### ఐదు వేల ఎకరాలు సాగులోకి తేవాలి

### అసెంబ్లీలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ నియోజకవర్గంలో అవుట్ ఫాల్స్ స్లూయిజులు నిర్మించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అసెంబ్లీలో మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఇరిగేషన్ రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఫలితంగా అవనిగడ్డ నియోజకవర్గంలోని తీర గ్రామాల్లో టీడీపీ హయాంలో నలభై బస్తాలు పండించిన ఐదు వేల ఎకరాల సాగు భూములు సైతం వైసీపీ పాలన సాగిన ఐదేళ్ల పాటు సాగుకు నోచుకోలేదన్నారు. మళ్ళీ సదరు ఐదు వేల ఎకరాలు సాగులోకి తీసుకువచ్చేందుకు సహకరించాలని, అందుకోసం నియోజకవర్గంలో అవుట్ ఫాల్ స్లూయిజులు నిర్మించాల్సిన ఆవశ్యక తను అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుల దృష్టికి తీసుకువెళ్లారు. తాను గతంలో టీడీపీలో చేరే సమయంలో కృష్ణా డెల్టాను కాపాడుతానని చంద్రబాబు హామీ ఇచ్చారని, అందుకు అనుగుణంగా పట్టిసీమను నిర్మించి డెల్టా రైతాంగానికి అండగా నిలిచారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలోనూ వారం వారం సమీక్షలతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వేగవంతంగా జరిగిందని, కూటమి ప్రభుత్వంలో పోలవరం నిర్మాణం త్వరితగతిన పూర్తి అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్టుపై ఆయన మాట్లాడుతూ దార్శనికులైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నిరంతరం ప్రజా సంక్షేమం గురించి ఆలోచించి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ రూపొందించారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలన ఫలితంగా పతనమైన విలువల పునరుద్ధరణకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. అధికారుల్లో జవాబుదారీతనం, ప్రజా ప్రతినిధుల్లో సేవాగుణం పెంపొందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు.

# కూనప రాజుపర్వలో వీధి కుక్కలకు 30 గొర్రెలు బలి





## సుమారుగా మూడు లక్షల రూ.50 వేల నష్టపోయిన గొర్రెల రైతు

## పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించాలి

**రెడ్డిగూడెం, మార్చ్ 3,మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కునప రాజు పర్వ గ్రామానికి చెందిన రాయల పుల్లారావు తన గొర్రెలను మేతకు తోలుకొని వెళ్లి ఇంటికి తీసుకొచ్చి గొర్రెల దొడ్డిలో ఉంచారు రాత్రి వేళలో వీధి కుక్కలు గొర్రెల మంద లోకి చొరబడి 30 గొర్రెలను చంపేయని రైతు పుల్లారావు వాపోయాడు. తనకు 60 గొర్రెలు ఉన్నాయని వీటిలో వీధి కుక్కల 30 గొర్రెలను చంపాయని మిగతా గొర్రెలను గాయపరిచాయని తెలిపారు. వీధి కుక్కల దాడిలో చనిపోయిన తమ గొర్రెలకు సుమారుగా మూడు లక్షల 50 వేల రూపాయల వరకు నష్టపోయానని తెలిపారు.

ప్రభుత్వం సాయం చేయాలని కోరారు. మిగతా గొర్రెలను కూడా గాయపరిచినాయని అని తెలిపారు.. ప్రభుత్వం అధికారులు స్పందించి నాకు లాగా ఇంకొకరు నష్టం పోకుండా ఉండే విధంగా వీధి కుక్కలను, గ్రామం నుంచి తీసుకువెళ్లే బయటి వదిలేయాలని కోరారు. వీధి కుక్కల బారి నుండి కాపాడాలని ఆయన కోరారు. ఇవే కాక మండలంలో పలు గ్రామాల్లో వీధి కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. ఎక్కడబడితే అక్కడ మనుషులను కూడా గాయపరుస్తున్నాయి.. రెడ్డిగూడెం మండలం వీధి కుక్కల సమస్య అధికంగా ఉంది పంచాయతీ అధికారులు పాలకులు స్పందించి వీధి కుక్కలను నుండి జీవాలను మనుషులను కూడా కాపాడాలని కోరుతున్నారు.

# 6న శ్రీరాజరాజేశ్వరీ సమేత రాజరాజేశ్వర నూతన ఆలయ ప్రతిష్ఠ

## శైవాగమ ప్రతిష్ఠా చార్యులు, పండితులచే

## మార్చి 4 నుండి 6వరకు పూజలు, అభిషేకాలు

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలం పెసరమిల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీరాజరాజేశ్వరి సమేత రాజరాజేశ్వర స్వామి నూతన ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం మార్చి 6వతేదీ గురువారం ఉదయం 11.38 గంటలకు జరుగుతుందని గ్రామ ఆలయ కమిటీ తెలిపింది. అలాగే నూతన ఆలయంతోపాటు ధ్వజ, శిఖర, విగ్రహ, యంత్ర, నవగ్రహ మండపం, శ్రీ సాయిబాబా ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలను తూర్పు గోదావరి జిల్లా, ద్రాక్షారామ వాస్తవ్యులు శైవాగమ ప్రతిష్టాచార్య బ్రహ్మ శ్రీ సంగమేశ్వర సురేష్ కుమార్ ఆధ్వర్యంలో, టిటిడి సన్మాన గ్రహీత శైవాగమ వాచస్పతి ప్రతిష్ఠాచార్య బ్రహ్మ శ్రీ కాళ్ళకూరి సూర్యశ్రీ(సూరిపండు) బ్రహ్మత్వంలో అనేకమంది శైవాగమ పండితులచే నిర్వహించబడుతుందని తెలిపారు. ఆలయ స్థల దాతలుగా చాగంటి వీర వెంకట విశ్వేశ్వర అయ్యవారుశాస్త్రి, రత్నకుమారి దంపతులు, శ్రీ రాజరాజేశ్వరి సమేత రాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రధాన దాతలుగా కమ్మిలి సాంబశివరావు, రాధిక దంపతులు, సాయిబాబా ఆలయ నిర్మాణ దాతలుగా కమ్మిలి మాణిక్యాలరావు, జయవాణి దంపతులు, నవగ్రహ మండప నిర్మాణ దాతలుగా కమ్మిలి ఈశ్వరరావు, లక్ష్మీనరసమ్మ దంపతులు,



రాజరాజేశ్వరి అమ్మవారి విగ్రహ దాతలుగా గుర్రాల లక్ష్మయ్య, ఝాన్సీ లక్ష్మి దంపతులు తమ దాతృత్వాన్ని చాటారన్నారు. 4వతేదీ, 5 వతేదీలలో ఉదయం విఘ్నేశ్వర పూజలు, వాస్తు హోమాలు, సాయంత్రం పూర్ణాహుతి, అభిషేకాలు నిర్వహించి, 6వతేదీ నూతన ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం అనంతరం అన్న సమారాధన నిర్వహిస్తామని, భక్తులు యావన్మందీ నూతన ఆలయ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు, తీర్థప్రసాదాలు స్వీకరించి, తరించాలని ఆలయ నిర్మాణ కమిటీ పెద్దలు కోరారు.




## హెల్మెట్ ధరించండి సురక్షితంగా గమ్యస్థానాలు చేరండి

**కంచికచర్ల మేజర్ న్యూస్:** హెల్మెట్ లేకుండా రహదారులపై తిరిగితే జరిమానాలు తప్పవని నందిగామ రూరల్ సీఐ చవాన్ హెచ్చరించారు. కంచికచర్ల మండలం కేసర గ్రామంలో జాతీయ రహదారి ప్రక్కన నో హెల్మెట్ నో ఎంట్రీ ఫ్లెక్సీ సోమవారం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హెల్మెట్ ధరించండి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోండి,మిమ్మల్ని మీరు రక్షించుకోండి, మీ కుటుంబాన్ని ఆదుకోండి, నో హెల్మెట్ నో ఎంట్రీ అనే నినాదాలతో కంచికచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి ప్రక్కన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగింది అని చెప్పారు.రోడ్డు ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలని హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, త్రిపుల్ రైడింగ్ చేయరాదని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. వేగం కన్నా ప్రాణం మిన్న అనే విషయాన్ని మర్చిపోవద్దని మిమ్మల్ని నమ్ముకుని మీ కుటుంబ ఉందన్న విషయం గుర్తుంచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బి రాజు సిబ్బంది పాల్గొన్నారు.

## బచ్చు ప్రదీప్ చిన్న వయస్సులోనే మృతి చెందడం విచారకరం



**అవనిగడ్డ మేజర్న్యూస్ :** బచ్చు ప్రదీప్ చిన్న వయస్సులోనే మృతి చెందడం విచారకరమని ప్రముఖ పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీను అన్నారు. అవనిగడ్డ 1వ వార్డుకు చెందిన బచ్చు వెంకట కుటుంబ రామారావు కుమారుడు బచ్చు ప్రదీప్ భౌతిక కాయానికి సోమవారం విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు నివాళులర్పించారు. ప్రదీప్ మోపిదేవి మండలంలోని పెదకళ్ళేపల్లి గ్రామంలోగల దుర్గా నాగేశ్వరస్వామివారి ఆలయంలో విధులు నిర్వహిస్తూ గత నెల 21 వ తేదీన ఆకస్మికంగా ఆలయంలోనే పడిపోయారు. వెంటనే ఆలయ సిబ్బంది కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు విజయవాడ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. ప్రదీప్‌కు బ్రెయిన్‌డెడ్ కావడంతో వారి కుటుంబసభ్యులు మరో 8 మందికి అవయువ ప్రాణదానం చేసేందుకు సహకరించారు. సోమవారం మృతదేహాన్ని అవనిగడ్డకు తరలించగా పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు ప్రదీప్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు.

## విద్యార్థులు కంటి ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి



**విజయవాడ మేజర్ న్యూస్ :** విద్యార్థులు కంటి ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చేలా తల్లితండ్రులు ఉపాధ్యాయులు తగు శ్రద్ధ తీసుకోవాలని ఎల్వీపీఈఐ వైద్యులు డాక్టర్ కృష్ణ ప్రియ సూచించారు. ఈ మేరకు విద్యార్థులు, వారి కంటి ఆరోగ్యంకి తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై సోమవారం నగరంలోని ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ కోడి వెంకటాద్రి చౌదరి క్యాంపస్ లో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ విద్యా సంవత్సరం ముగుస్తున్న సమయంలో, లక్షలాది మంది విద్యార్థులు తమ సంవత్సరాంత పరీక్షలు కి సిద్ధపడుతున్న సమయంలో కంటి ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు. ఎక్కువ గంటలు చదువుతూ ఉండే ఈ సమయం ఆందోళన, ఒత్తిడితో కూడుకున్నదన్నారు. సుదీర్ఘమైన అధ్యయన సెషన్లతో పాటు డిజిటల్ అభ్యాసం, స్క్రీన్ సమయం ఫలితంగా విద్యార్థులు కంటి అలసట బారిన పడుతున్నారన్నారు. పొడి కళ్ళు, తలనొప్పులు, చెదిరిన చూపు, మైగ్రేన్ల వంటి లక్షణాలు సర్వసాధారణ సమస్యలవుతున్నాయన్నారు. పరీక్షకు తయారవుతున్న సమయంలో కంటి ఒత్తిడిని ఎదుర్కోవడానికి సామర్థ్యాన్ని పెంచడానికి, సమగ్రమైన ఒక కంటి పరీక్ష చేయించుకోవడం, 20-20-20 నిబంధన, ప్రతి 20 నిమిషాలకు 20 అడుగుల దూరంలో ఉన్నదానిని 20 సెకన్ల పాటు చూడటం, తరచుగా రెప్పలు ఆర్పడం, వెన్నుముక సరైన భంగిమ లో ఉంచడం, డిజిటల్ సాధనాన్ని పరిమితంగా ఉపయోగించడం, ఎయిర్ కండిషనింగ్ నేరుగా తగలకుండా జాగ్రత్త పడటం, బాగా వెలుతురు ఉన్న గాలి ప్రసరణ ఉన్న గదులలో కూర్చోవడం, శారీరిక శ్రమ నిద్రకు ప్రాధాన్యత ఇవ్వడం, తగినంత నీరు ఇతర, ద్రవాలు తీసుకోవడం వంటివి చేయాలని సూచించారు. దీంతో కంటి ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు.

## సరికొత్త డిజైన్, మాన్స్టర్ పనితీరుతో సామ్‌సంగ్ గెలాక్సీ ఎం16 5జీ, గెలాక్సీ ఎం06 5జీ




**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, పలు విభాగాలలో అత్యున్నత ఫీచర్లతో రెండు మాన్స్టర్ పరికరాలైన గెలాక్సీ ఎం165జీ, గెలాక్సీ ఎం06 5జీలను విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. అత్యంత ప్రజాదరణ పొందిన గెలాక్సీ ఎం సిరీస్‌కు తాజా చేర్పులు శైలి, అత్యాధునిక ఆవిష్కరణల యొక్క ఆకట్టుకునే కలయికను అందిస్తాయి. ఎం16 5జీ, గెలాక్సీ ఎం06 5జీ ఎం సిరీస్ యొక్క జంట వారసత్వాలు మాన్స్టర్ ఆవిష్కరణలు, పనితీరుతో వస్తాయని సామ్‌సంగ్ ఇండియా ఎంఎక్స్ బిజినెస్ జనరల్ మేనేజర్ అక్షయ్ ఎస్.రావు అన్నారు.

## శ్రీరామ లక్ష్మణ సీత,ఆంజనేయ, వీరభద్ర, విగ్రహాల ఊరేగింపు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం ఈడేపల్లిలో జోడు గుళ్ళు దేవాలయం ప్రాంగణం నుండి ప్రతిష్టాపన కొరకు శ్రీరామ లక్ష్మణ సీత ఆంజనేయ వీరభద్ర విగ్రహాలను ట్రాక్టర్ పై ఊరేగించుచు పురవీధుల్లో త్రిప్పుతూ ప్రతిష్టాపన కొరకు తీసుకెళుతున్నారు. ఈ ఊరేగింపుకు ముందు కనక తప్పట్లు సన్నాయి డోలు వాయిద్యాలు విచిత్ర వేషధారాణ లో హనుమంత వేషధారణ భక్తులు వెనక ముందు నడుస్తూ విగ్రహాలను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## చెత్త దిబ్బలు తొలగించి కాలవల పూడికతీత

### పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి : కార్యదర్శి వనిత

**కంచికచర్ల మార్చి 3 మేజర్ న్యూస్ :** గ్రామస్తులు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని గొట్టుముక్కల గ్రామపంచాయతీ కార్యదర్శి సిహెచ్ వనిత అన్నారు. సోమవారం ధనలక్ష్మి కాలనీ వద్ద రోడ్డు పక్కన ఉన్న చెత్త దిబ్బలను జెసిబి సహాయంతో ట్రాక్టర్ ద్వారా తొలగించారు. గ్రామంలోని మురుగు కాలవలలో పూడిక తీయించారు. రోడ్డు పక్కన చెత్త కుప్పలు వేయరాదని పంచాయతీ వాహనాల్లో చెత్త పడేయాలని కార్యదర్శి గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తులిమల్లి రాజ్ కుమార్ ఉప సర్పంచ్ గోగినేని అమర్నాథ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## గుడివాడలో రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించండి




**గుడివాడ, మేజర్ న్యూస్:** గుడివాడ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అసెంబ్లీలో కోరారు. గుడివాడ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల సోమవారం అసెంబ్లీలో విజ్ఞాపన చేసారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాల్లో అయన మాట్లాడుతూ గుడివాడలో రోడ్ల సమస్యను ప్రత్యేకంగా గుర్తించాలనీ శాసనసభ వేదికగా విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారుల కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే వేలాది కిలోమీటర్లు మేర రోడ్లపై గుంతలు పూడ్చారు. గత కొన్ని సంవత్సరాలుగా రోడ్ల అభివృద్ధి లేక పోవడంతో గుడివాడ నియోజకవర్గంలో సమస్య మరింత తీవ్రంగా ఉందన్నారు. అనేక ప్రాంతాల్లో ప్రధాన రహదారులు అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. రోడ్లకు ఇరువైపులా కాలువలు ఉండడంతో సమస్య ఎక్కుగా ఉందన్నారు. ప్రధానంగా గుడివాడ బైపాస్ రోడ్డు, గుడివాడ పోలుకొండ, పోలుకొండ ఇలపర్రు, గుడ్లవల్లేరు – ముదినేపల్లి, సిద్ధాంతం – పెద్దఎడ్లగాడి, పెంజెంద్ర, తట్టివర్రు రోడ్ల అభివృద్ధికి నిధుల కేటాయింపులో గుడివాడకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈ నెల 5న గురువారం పెనమలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కుమారుని వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విచ్చేస్తున్న నేపథ్యంలో, భద్రత ఏర్పాట్లను సోమవారం జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు పోలీసు అధికారులతో కలిసి పర్యవేక్షించారు. రిసెప్షన్ కార్యక్రమం వి.ఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరుగుతుండగా, ఆ ప్రదేశాన్ని పరిశీలించి బందోబస్తు విధులపై అధికారులకు సూచనలు చేశారు.

## ఆకట్టుకున్న మహిళల మురళీ కోలాటం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలం లక్ష్మీపురంలోని శ్రీదుర్గా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ప్రదర్శించిన మహిళల మురళీకోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీదుర్గా సోమేశ్వర మహిళా కోలాట బృంద సభ్యులు గత 15 రోజులుగా కోలాట ప్రదర్శన నేర్చుకుని తొలి ప్రదర్శన స్వామివారి సన్నిధిలో ప్రదర్శించారు. దేవరకోటకు చెందిన గురువు మారుతి వద్దమహిళలు కోలాటం నేర్చుకున్నారు. కోలాట భక్తసమాజాన్ని ఆలయ అర్చకులు భమిడిపాటి బాలసుబ్రహ్మశర్మ, స్థానికులు అభినందించారు.

# ప్రాథమిక దశలోనే వినికిడి సమస్యలను గుర్తించాలి..




**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మార్చి 3, మేజర్ న్యూస్ :** చిన్న పిల్లల్లో వినికిడి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా వారి ఆరోగ్యకర జీవితానికి మంచి పునాది వేయొచ్చని.. చెవి సంరక్షణ, వినికిడి ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆలోచనా విధానాన్ని మార్చుకొని.. చెవి సంరక్షణ, వినికిడి ఆరోగ్యంపై సాధికారత సాధిద్దాం.. ఇతివృత్తంతో ఈ ఏడాది ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, చిన్న పిల్లలుగా ఉన్నప్పుడే తొలిదశలోనే వినికిడి లోపాలు గుర్తించి, సరైన వైద్యం అందించడం ద్వారా లోపాలను తొలగించవచ్చన్నారు. వినికిడి సమస్యలకు కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయంలో క్షేత్రస్థాయి వైద్యాధికారులు, ఏఎన్ఎం, ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు బృందంగా చొరవచూపాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, సీపీవో వై.శ్రీలత, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, పీవో–యూసీడీ వెంకటరత్నం, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, ఎన్ సిడి కార్యక్రమం అధికారి డాక్టర్ మాధవి నాయుడు, ఎల్‌డీఎం కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



# పాత, కొత్త ఎంఎస్ఎంఈ కస్టమర్లకు అవగాహన





**విజయవాడ, మార్చి 3, మేజర్ న్యూస్ :** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ ఆఫీస్ (వన్ టౌన్, విజయవాడ)లో సోమవారం ఎంఎస్ఎంఈ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించి, బ్యాంక్ యొక్క పాత్ర, క్రొత్త ఎంఎస్ఎంఈ కస్టమర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముప్వల శ్రీధర్, రీజనల్ హెడ్, విజయవాడ స్వాగత ప్రసంగంతో ఈ కార్యక్రమం మొదలవగా, ఎం. ఎస్. రామారావు, డిప్యూటీ జోనల్ హెడ్ ఈ ఔట్ రీచ్ క్యాంపును నిర్వహించడంలోని హేతుబద్ధతపై మరింత అవగాహన కల్పించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ ఆఫీస్, ముంబై నుంచి విచ్చేసిన బిజు వాసుదేవన్, చీఫ్ జనరల్ మేనేజర్ తన ముఖ్య ప్రసంగంలో, ఎంఎస్ఎంఈల సమర్థత, సామర్థ్యం గురించి, భారత ఆర్థిక వ్యవస్థలో అవి పోషిస్తున్న పాత్ర గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి హరీష్ బేతా,డిప్యూటీ రీజినల్ హెడ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొంతమంది ఎంఎస్ఎంఈ రుణగ్రస్తులకు మంజూరు పత్రాలు అందచేశారు. ఈ సమావేశానికి విజయవాడ నలుమూలల నుండి 150 మందికి పైగా ఎంఎస్ఎంఈ వ్యవస్థాపకులు, యూనియన్ బ్యాంక్ యొక్క వివిధ శాఖల మేనేజర్లు, ఇతర అధికారులు హాజరయ్యారు.




# మెప్మా, హోమ్ ట్రయాంగిల్ ఆధ్వర్యంలో హోమ్ సేవలు





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మెప్మా, హోమ్ ట్రయాంగిల్ సంయుక్తంగా ప్లంబింగ్ సేవలు, విద్యుత్ సేవలు, గృహపకరణాలు, రిపేరింగ్ సేవలకు, హోమ్ ట్రయాంగిల్ అనే ఆప్ ద్వారా వారిలో గల నైపుణ్యం ను విజయవాడ నగర ప్రజలకు అందించి, చక్కటి ఆదాయాన్ని పొందటానికి సదవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు మెప్మా ఎండి తేజ్ భరత్. సోమవారం ఉదయం గవర్నర్ పేటలో గల ఎలక్ట్రిషన్ ట్రైనింగ్ సెంటర్‌ను విచ్చేసి అక్కడున్న సర్వీస్ ప్రొవైడర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా మెప్మా ఎండి తేజ భరత్ మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలు పూర్తి అయ్యే తరుణంలో సర్వీస్ ప్రొవైడర్లను ఆన్ బోర్డ్ చేస్తున్నారని ఇప్పటివరకు 824 సర్వీస్ ప్రొవైడర్లను గుర్తించారని, వారి సేవలను అతి త్వరలో ప్రజలకు అందించి వారి ఆదాయాన్ని పెంచే విధంగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. 824 సర్వీస్ ప్రొవైడర్లను కేవలం శిక్షణ ఇవ్వటమే కాకుండా నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ సర్టిఫికెట్ ను వారికి అంద చేశారని తెలిపారు. వారికి కేవలం ఉచితంగా శిక్షణ ఇవ్వటమే కాకుండా హోమ్ ట్రయాంగిల్ అనే యాప్‌లో ఉచితంగా ఆన్ బోర్డ్ చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) పి వెంకటనారాయణ, నగరపాలక సంస్థ అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ 2025 అభివృద్ధికి దోహదం



### తెలుగు భాషకు ప్రత్యేక కేటాయింపు

### ప్రభుత్వ విప్,గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్

**గన్నవరం, మార్చి 3, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 2025 ఆర్థిక సంవత్సరానికి గాను అత్యంత సమగ్రమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ తెలిపారు. 4 వ రోజు అసెంబ్లీలో సమావేశంలో బడ్జెట్ పై ఆయన ప్రసంగించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మొత్తం 3,23,359 కోట్ల రూపాయలతో బడ్జెట్ రూపొందించారని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, అభివృద్ధికి మరింత ఊతమిచ్చేలా కేటాయింపులు చేసారని అన్నారు. గత కొన్నేళ్లుగా ఆర్థికంగా తీవ్ర సవాళ్లను ఎదుర్కొన్న రాష్ట్రానికి ఇది మెరుగైన బడ్జెట్‌గా నిలుస్తుందని తెలిపారు. మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పిట్టకథలు చెప్పడం మినహా బడ్జెట్ ద్వారా రాష్ట్రానికి మేలు కలిగించే ప్రయోజనాలు చేకూర్చలేదన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించేందుకు సీఎం చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రస్తావిస్తూ.. విపత్తులను అవకాశాలుగా మార్చుకునే నాయకత్వం ఈ బడ్జెట్‌లో స్పష్టంగా కనిపిస్తోంది అని పేర్కొన్నారు.

**తెలుగుబాషకు 10 కోట్ల కేటాయింపు హర్షణీయం**

తెలుగు భాష అభివృద్ధికి రూ.10 కోట్ల కేటా యింపు చేయడం హర్షణీయమన్నారు. దేశ భాషలలో తెలుగు గొప్పతనాన్ని చాటేలా ఈ ప్రభుత్వం తెలుగు భాష కోసం నిర్ణయం తీసు కోవడం గొప్ప విషయమన్నారు. ఇటలీ యాత్రి కుడు నికోలె డి కోంటే, మహాకవి శంకరాచార్య సుందరాచార్య, శ్రీకృష్ణదేవరాయలు వంటి మహనీయులు తెలు గును ప్రోత్సహించిన విషయాన్ని సభలో ప్రస్తావించారు. తెలుగు భాషపై వైసీపీ హయాంలో నిర్లక్ష్య వైఖరి కనిపిం చిందని, విద్యా వ్యవస్థలో తెలుగును తొలగించి ఇంగ్లీష్‌కి ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. అయితే, ఈసారి చంద్రబాబు నాయుడు పాలనలో మాతృ భాషను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కేటాయింపు జరగడం ప్రతి తెలుగువాడూ అభినందించాల్సిన విషయం అని తెలిపారు.

**గ్రామీణాభివృద్ధి, విద్యా, బీసీ సంక్షేమానికి భారీ కేటాయింపులు**

గ్రామ పంచాయతీ అభివృద్ధికి రూ.18,847 కోట్ల నిధులు కేటాయించడం పట్ల ప్రభుత్వానికి ఎమ్మెల్యే యార్లగడ్డ ధన్యవాదాలు తెలిపారు. గతంలో సర్పంచులు కోర్టుకు వెళ్లినా నిధులు రాకపోవడం వంటి సమస్యలు ఎదురవ్వగా, ప్రస్తుతం గ్రామ స్వరాజ్యాన్ని సాధించే దిశగా ఎన్డీయే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. జగన్ ప్రభుత్వ అసమర్థ పాలన వలన విద్యా రంగం లోనూ గత ప్రభుత్వ హయాంలో అనేక పాఠశాలలు మూతపడటం వల్ల వేలాది మంది విద్యార్థులు చదువును ఆపాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. దీనిని సరిదిద్దేందుకు ప్రభుత్వం విద్యా శాఖకు రూ.31,805 కోట్ల బడ్జెట్ కేటాయించిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, విద్యా వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసే దిశగా మంత్రి నారా లోకేష్ అడుగులు వేస్తున్నారని ప్రశంసించారు. అలాగే, బీసీ సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, తగిన నిధులు కేటాయించడం హర్షనియమని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం బీసీల ప్రభుత్వమని పేర్కొన్నారు. అలాగే, చేనేతవృద్ధి అభివృద్ధి కోసం రూ. 20 కోట్లు కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అత్యంత తక్కువ అభివృద్ధి చేసిన ప్రభుత్వం వైసీపీ అని విమర్శించారు. గత ప్రభుత్వ చేసిన పనికి గుంతలు లేని ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం చేపట్టాల్సి వచిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్ల పూడ్చడం, మరమ్మతులు చేస్తున్నామని వివరించారు. పారిశ్రామిక రంగంలోనూ వైసీపీ హయాంలో పెద్ద కంపెనీలు పెట్టుబడులకు వెనుకంజ వేసినట్లు ఆరోపించారు. తన నియోజకవర్గంలోనే అశోల్ లే ల్యాండ్ కంపెనీ వెనక్కి వెళ్లిపోయిందన్నారు. పెట్టుబడిదారులు ముందుకు రావడానికి ఆసక్తి చూపలేదని, అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి పెద్ద పీట వేస్తుందని చెప్పారు. రైతాంగాన్ని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. నీటి సరఫరా సకాలంలో అందకపోవడం, ఖరీఫ్, రబీ పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, 2024లో ధాన్యం కొనుగోలు చేయక 60 లక్షల మంది రైతులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టడం వంటి పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు.

**ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్విభజనపై విమర్శలు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన జిల్లాల పునర్విభజన గత ముఖ్యమంత్రి జగన్ అనుభవ రాహిత్యంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగించిందని విమర్శించారు. పునర్విభజనలో తన నియోజకవర్గం రెండు జిల్లాలలో ఉందని.. ప్రజల అవసరాలను గణనలోకి తీసుకోకుండా నిర్ణయాలు తీసుకున్నారని మండిపడ్డారు. కృష్ణా జిల్లాలో విజయవాడ నుంచి గన్నవరం 19 కిలోమీటర్లు కాగా, గన్నవరం నుంచి మచిలీపట్నం 64 కిలోమీటర్లు దూరంగా ఉందని అలాగే, పెనమలూరు నుంచి విజయవాడ 9 కిలోమీటర్ల దూరంలో ఉంటే, మచిలిపట్నం 60 కిలోమీటర్ల దూరంలో ఉందని వీటి వలన ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలు, రెవెన్యూ డివిజన్ కేంద్రాలు మరింత దూరంగా మారాయని తెలిపారు. ప్రజలకు అత్యవసరమైన ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ కమిషనరేట్, ఎస్పీ కార్యాలయాల దూరం పెరిగిన పరిస్థితిని ప్రభుత్వమే సరిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. గన్నవరం ఎయిర్‌పోర్ట్ విజయవాడకు 16 కిలోమీటర్ల దూరంలో ఉంటే, మచిలిపట్నం ఎస్పీ కార్యాలయం 60 కిలోమీటర్ల దూరంలో ఉండడం ప్రజలకు ఇబ్బంది అని పేర్కొన్నారు. అలాగే, కొత్త జిల్లాల్లో అన్ని శాఖలకు అవసరమైన ముఖ్య కార్యాలయాలు ఇంకా ఏర్పాటు కాలేదని తెలిపారు.

తన అనుభవాన్ని భాగస్వామ్యం చేస్తూ, కేడిసీసీ బ్యాంకు చైర్మన్‌గా ఉన్న సమయంలో రూ. 5,200 కోట్ల టర్నోవర్‌ను రూ. 8,000 కోట్లకు పెంచినట్లు, అలాగే 1,000 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు, మరో 1,000 మందికి ఇంటర్న్‌షిప్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. దేశంలోనే నెంబర్ వన్ బ్యాంక్ గా చేస్తే తనను చైర్మన్గా తొలగించారని గుర్తు చేశారు.

**జగన్ ప్రతిపక్ష హోదా కోరడం పై ఆగ్రహం**

ఎన్నికలకు ముందు జగన్‌కు ప్రతిపక్ష హోదా రాదని ముందే చెప్పానని అన్నట్లుగానే ప్రజలు జగన్కు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వ్యాఖ్యానించారు. గత వైసీపీ మంత్రులు అసెంబ్లీ లో బూతులు మాట్లాడి సభను అగౌరవ పరిచారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ధ్వజమెత్తారు. భారత స్వాతంత్ర్యం తర్వాత రాజ వంశాలకు చెందిన వారే మంత్రులుగా వ్యవహరించిన సందర్భాలను ప్రస్తావించారు. మద్రాస్ రాష్ట్రంలో ఆరోగ్య శాఖ మంత్రిగా రాజవంశానికి చెందిన వారు పని చేసినట్టుగా, రాజులు కూడా ప్రజాస్వామ్యంలో సేవలందించినట్లు గుర్తు చేశారు. కానీ జగన్ రెడ్డి మాత్రం అసెంబ్లీ నాలుగో గేట్ నుండి రానని రెండో గేటు నుండి పంపితేనే వస్తానని అసెంబ్లీకి దుమ్మా కొట్టారని ఎద్దేవా చేశారు. ప్రజా వేదిక ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారని ఆ అర్జీలు ఏమి చేస్తారో ఆయన సొంత నిధులు ఇస్తారో తెలియదని ఎద్దేవా చేశారు.

**ఎపి స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ డిపార్టుమెంటు కి సూచనలు.**

బ్రిటిష్ ఇండియా 1899 రిజిస్ట్రేషన్ యాక్ట్ కు బదులుగా, నూతన ఎ పి రిజిస్ట్రేషన్ యాక్ట్ తీసుకువస్తే రాష్ట్ర ఖజానా కు 1000 కోట్లు ఆదాయం వచ్చే అవకాశం ఉందని యార్లగడ్డ పేర్కొన్నారు. మన అసెంబ్లీ లో బిల్ పాస్ చేసుకొని, పార్లమెంట్, రాష్ట్రపతి ఆమోదంతో ఇది సాధ్యం చెయ్యవచ్చన్నారు. రాజస్థాన్, గుజరాత్, వెస్ట్ బెంగాల్ & మహారాష్ట్ర వారి సొంత స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ యాక్ట్ ని అమలు ని చేస్తున్నాయన్నారు. ఈ రాష్ట్రాల యాక్ట్స్‌ని క్షుణ్ణంగా అధ్యయనం చెయ్యాల్సింది గా చేయాలని స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ డిపార్టుమెంటు ను కోరారు.

**జీఓ 90 అమలు చేయాలి.**

పి ఎ సి ఎస్ సెక్రెటరీల పదవి కాలం మొత్తం వారు జాయిన్ అయిన ఊర్లోనే రిటైర్ అవుతున్న పరిస్థితి ఉందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ పేర్కొన్నారు. వారు సర్వీస్ మొత్తం దాదాపు 35 సం..లు ఒకే బ్యాంకులో పనిచేస్తూ కొంతమంది అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. పిఏసిఎస్ సెక్రటరీలకు ట్రాన్స్ఫర్స్ లేక పోవడం అనేది చాలా దారుణమన్నారు. ఆ ఊర్లో బ్యాంకు ప్రెసిడెంట్ చదువుకోని వాళ్ళు అయితే, వీరే పెత్తనం చేస్తున్నారని వాళ్లకి ట్రాన్ఫర్స్ కచ్చితంగా ఉండాల్సిందే అని నేను ప్రభుత్వం నుంచి ప్యాక్స్ పి ఎ సి ఎస్ సెక్రటరీల ట్రాన్ఫర్స్ కి సంబంధించి కష్టపడి ఒప్పించి హెచ్ ఆర్ పాలసీ రెడీ చేసి ఇచ్చి జీవో నెం: 90 తీసుకొచ్చనన్నారు.. కాని జీవో నెం: 90 అమలకు మాత్రం నోచుకోలేదనిఈ జీవో 90 ని అమలు చేస్తే ఈ పిఏసిఎస్ సెక్రెటరీల వ్యవస్థలో ప్రక్షాళన జరుగుతుందన్నారు.

**తెలంగాణ అసెంబ్లీ సందర్శనకు ఎమ్మెల్యే యార్లగడ్డ విజ్ఞప్తి**

గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ తన చిన్ననాటి కలను నెరవేర్చుకున్న సందర్భంగా భావోద్వేగంగా స్పందించారు. అసెంబ్లీకి హాజరయ్యే కోరిక తన 9వ తరగతి నుంచి ఉండేదని తెలిపారు. ఈ కోరికను గన్నవరం ప్రజలు నెరవేర్చారని ఆయన పేర్కొన్నారు. నన్ను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి కృషి చేస్తున్నాను అని ఆయన అన్నారు. చిన్ననాటి రోజుల్లో హైదరాబాద్ అసెంబ్లీనే తనకు గుర్తు వస్తుందని రాష్ట్ర విభజన అనంతరం ఆ కల ఇక్కడ నెరవేరింది అని ఎమ్మెల్యే యార్లగడ్డ పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీని సందర్శించే అవకాశం కల్పించాలనని స్పీకర్, ముఖ్యమంత్రిని యార్లగడ్డ కోరారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు




**నందిగామ, మార్చి 3, మేజర్ న్యూస్:** పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను ఇన్చార్జి సిడిపిఓ కృష్ణకుమారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగనవాడి వర్కర్లు బాల్య వివాహాలు నియంత్రణపైన కొవ్వొత్తుల ర్యాలీ, ప్రతిజ్ఞ, కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు ఈనెల 8వ తేదీ వరకు ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఇన్చార్జి సిడిపిఓ కృష్ణకుమారి తెలిపారు, ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు కరుణ కుమారి తారాబీ, వెంకట్రావమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని మండలి నిలబెట్టుకోవాలి



**అవనిగడ్డ మేజర్‌న్యూస్ :** అవనిగడ్డ నియోజకవర్గ ప్రజలను నిరాశపర్చేలా శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ప్రసంగం ఉందని యువనేత బడే గౌతమ్ అన్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో ఎంఎల్ఏ మండలి బుద్ధప్రసాద్ మన ప్రాంత సమస్యలను ప్రస్తావించి పరిష్కారం చూపుతారని ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రజలకు వారి ప్రసంగంలో అధిక భాగం సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌లకు భజన చేయడం, ప్రతిపక్షం పై అసత్య అరోపణలు చేయడం పైనే సరిపెట్టారని నియోజకవర్గ ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారని గౌతమ్ ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా చదివే బడుగు బలహీనవర్గాలకు చెందిన వారి పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యనందించి ఈ పోటీ ప్రపంచంలో ఉన్నత శిఖారాలనుఅధిరోహించాలని ప్రభుత్వ పాఠశాలల్లో గత ప్రభుత్వం ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టి పాఠ్యాంశాలలో ఇంగ్లీష్‌తోపాటు దానికి తెలుగు అనువాదం కూడా ఇస్తే వాస్తవాలను వక్రీకరించి తెలుగు భాషా ఉద్ధారకుడిలా మాట్లాడటం చూస్తే అధికార తెలుగు భాషా సంఘం అధ్యక్ష పదవి కోసం ప్రయత్నం చేస్తున్నట్లుగా కనబడటాన్ని ప్రజలందరూ గమనిస్తున్నా రని, తెలుగు భాషకు వచ్చే ముప్పు ఏమీ లేదని, ఈ జగత్తు ఉన్నంతవరకు తెలుగు భాష వర్ధిల్లుతుందని అది తెలుగు భాషకున్న గొప్పతనమని దానికెవరూ ప్రత్యేకించి ఉద్ధారణ చేయవలసిన అవసరం లేదని గౌతమ్ అన్నారు.

సభలో మాట్లాడిన మిగిలిన సభ్యులంతా వారి ప్రాంత సమస్యల ప్రస్తావన చేస్తుంటే బుద్ధ ప్రసాద్ మాత్రం మన ప్రాంత సమస్యల పట్ల నామ మాత్రపు ప్రస్తావన మాత్రమే తెచ్చి వాటి పరిష్కారానికి ఏమి చేయాలో సూచన చేయకపోవటం ఈ ప్రభుత్వంలో రైతులకు ఎనలేని మేలు జరిగిందని అసత్యాలు చెప్పుకొచ్చిన ఎమ్ఎల్ఏ మండలి రైతులకు గిట్టుబాటు ధర లేక ఎకరానికి 15వేల నుండి 20వేల రూపాయలు నష్టపోయిన విషయాన్ని గుర్తుచేసి ఈ ప్రభుత్వాన్ని గిట్టుబాటు ధర కోసం నిలదీయక పోవడం అత్యంతదారుణం అని గౌతమ్ అన్నారు. ఈ పర్యాయం వచ్చే విలువైన అవకాశాన్నైనా పొగడ్తలకు కేటాయించకుండా మన ప్రాంత సమస్యలపై దృష్టిపెట్టి నియోజకవర్గ ప్రజలకు మీపై నమ్మకాన్ని నిలబెట్టుకునే ప్రయత్నాన్ని చేయాలని గౌతమ్ సూచించారు.

## 5న సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమము

**జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి డీఎంఎఫ్ విజయ కుమారి**

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఈ నెల 5 వ తేదీ బుధవారం జిల్లాలోని 17 మండలాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. సామూహిక పద్దతిలో వరి పండించు 141 గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, శాస్త్రవేత్తలు పాల్గొంటారన్నారు.. కార్యక్ర మంలో గ్రా మ రైతు సోదరులు అందరూ సమిష్టిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవం తం చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఆ ప్రకటనలో తెలిపారు.

## పదో తరగతి పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లు విడుదల

**వాట్సాప్ ద్వారా హాల్ టికెట్లు డౌన్లోడ్**

**విజయవాడ, మార్చి 3, మేజర్ న్యూస్ :** మార్చి 2025 ఎస్ఎస్ సి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సంబంధించిన హాల్ టికెట్లు సోమవారం మధ్యాహ్నం నుండి పాఠశాల ప్రధానోపాధ్యాయుల లాగిన్ లో అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డా. కె.వి.శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్ సి పబ్లిక్ పరీక్షల, మార్చి–2025 హాల్ టిక్కెట్లను వాట్సాప్ – మన మిత్ర ద్వారా విద్యార్థులు నేరుగా డౌన్లోడ్ చేసుకునేలా తొలిసారిగా ప్రక్రియ ప్రారంభించామన్నారు.

**వాట్సాప్‌లో ఇలా డౌన్లోడ్ చేసుకోవచ్చు**

– అభ్యర్థులు వారి వాట్సాప్ యాప్ ద్వారా 9552300009 కి 'Hi' అనే సందేశాన్ని పంపాలి.
– Choose Service లేదా "సేవను ఎంచుకోండి"పై క్లిక్ చేయాలి.
– తర్వాత Education Services లేదా "విద్యా సేవలు"ని ఎంచుకోండి.
– తర్వాత SSC Hall Ticketని ఎంచుకోండి. తర్వాత విద్యార్థి Application Number/Child ID, పుట్టిన తేదీని నమోదు చేసి, స్ట్రీమ్‌ను ఎంచుకుని, మీ వాట్సాప్ యాప్ నంబర్‌లో మీ హాల్ టికెట్‌ను స్వీకరించడానికి Confirmపై క్లిక్ చేయండి.

**వివరాలు సరి చూసుకోవాలి :** పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాల్ టికెట్‌లో విద్యార్థుల వివరాలైన పేరు, పుట్టిన తేదీ, మాధ్యమం, ఫోటో, సంతకం, సబ్జెక్టులు మొదలైనవన్నీ పూర్తిగా సరిచూడాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డా. కె.వి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అభ్యర్థి వివరాల్లో సబ్జెక్టు సరిపోలకపోతే, సంబంధిత ప్రధానోపాధ్యాయులు వెంటనే dir_gov-exams@yahoo.com లేదా dir_govexams@apschooledu.in ఇమెయిల్ ద్వారా దిగువ సంతకం చేసినవారి దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## బాలల సంరక్షణ కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలచే నడుపబడుతున్న బాలల సంరక్షణ కేంద్రాలు బాలల న్యాయ (జువెనైల్ జస్టిస్) చట్టం 2015 లోని సెక్షన్ 41 క్రింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ సంచాలకులు ఎం. వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో ఆయా బాలల సంరక్షణ కేంద్రాల యాజమాన్యాలను కోరారు. ఇందుకొరకై ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. కొంతమంది బాల సంరక్షణ కేంద్రాల యాజమాన్యాలు రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రకటన తమ దృష్టికి రానందున రిజిస్ట్రేషన్ కొరకు మరికొంత సమయం ఇవ్వవలసిందిగా కోరారని వేణుగోపాల్ రెడ్డి చెప్పారు. ఆయా సంస్థల యాజమాన్యాలు విజ్ఞాపణల మేరకు రిజిస్ట్రేషన్ కొరకు మార్చి 10వ తేదీ వరకూ దరఖాస్తులు సమర్పించుకోవడానికి సమయం పొడిగించామని చెప్పారు. పిల్లల రక్షణ సంరక్షణ కొరకు నడపబడుతూ ఇప్పటివరకూ రిజిస్ట్రేషన్ చేసుకొని సంస్థలు బాలల న్యాయ చట్టం 2015 ననుసరించి సెక్షన్ 41 క్రింద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని శాఖ సంచాలకులు వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. దరఖాస్తు ఫారం ఇతర సమాచారంను http://wdcw.ap.gov.in వెబ్ సైట్ నుండి పొందవలెనని ఆయన చెప్పారు. మార్చి 10, 2025వ తేదీ తర్వాత రిజిస్ట్రేషన్ పొందకుండా బాలల సంరక్షణ కేంద్రాలు నడుపబడినట్లైతే అటువంటి వ్యక్తులపై, సంస్థల పై చట్టపరమైన చర్యలు తీసుకోబడునని బాలల సంక్షేమము, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ సంచాలకులు ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

## విద్యార్థినిలకు వ్యాస రచన పోటీలు నిర్వహించిన యస్.ఐ.శ్రీనివాసరావు



**నందివాడ,మేజర్ న్యూస్:** మహిళా దినోత్సవం పురస్కరించుకుని లింగ సమానతను ప్రోత్సహించడం, పితృ స్వామిక నిబంధనలను సవాలు చేయడంలో పురుషులు పాల్గొనాల్సిన అవసరత అనే అంశంపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రుద్రపాకలో సోమవారం ఉదయం నందివాడ పోలీసు వారు వ్యాసరచన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నిలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 40 రోజులు పాటు శ్రమ దినాలు

**దీక్ష చేపడుతున్న క్రైస్తవ విశ్వాసులు**

**నియమనిబంధనలు వివరించిన, ఫాదర్ ఎన్ డేవిడ్ రాజు**





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** విశ్వవ్యాప్తంగా రేపటి నుంచి తపస్సు కాలం ప్రారంభం కానుంది. ఈనెల 5న విభూది బుధవారం నుంచి తపస్సు కాలం ప్రారంభమవుతుంది. 40 రోజులపాటు శ్రమదినాలు ఆచరించడానికి క్రైస్తవ విశ్వాసులు దీక్ష చేపడతారు. ఇందుకోసం మచిలీపట్నంలోని ఆర్సియం దేవాలయం సంసిద్ధమయింది. దేవాలయ ప్రాంగణంలో గల 14 స్థలాలు కొత్త రూపును సంతరించుకున్నాయి.ఇందుకు సంబంధించిన నియమ నిబంధనలను మచిలీపట్నం కు చెందిన పరిశుద్ధ సిలువ దేవాలయం ఫాదర్ ఎన్ డేవిడ్ రాజు తెలియపరిచారు. ఈ శ్రమల కాలం ప్రతి ఒక్కరికి దీవెనకరంగా మారాలని ఆశిస్తూ ప్రార్థిస్తామని ఫాదర్ డేవిడ్ రాజ్ సోమవారం తెలిపారు. తపస్సు కాలంలో దీక్ష చేపట్టే విశ్వాసులు తెల్ల దుస్తులు ధరించి జప మాల ఆచరించాలన్నారు. ప్రతిరోజు బైబిల్ పఠనం చేస్తూ ధ్యానంలో పాల్గొనాలని అలాగే దివ్య బలి పూజలో పాలుపంచుకోవాలని సూచించారు. సర్వేశ్వరుని పదిఆజ్ఞలు, తిరుసభ కట్టడాలను గమనంలో పెట్టుకొని జీవించాలన్నారు. రోగుల పరామర్శ,వృద్ధులకు తోడ్పాటు,పేదలు అనాధలను ఆదరించే రీతిలో రోజుకు కనీసం రెండు పుణ్య కార్యాలు చేపట్టాలన్నారు.దీక్షాపరులు ప్రతిరోజు ఒక పూట ఉపవాసం ఆచరించాల్సి ఉంటుందన్నారు. దేవునికి స్తోత్రం అంటూ ఒకరికి ఒకరు అభివాదం చేసుకోవాలన్నారు. విభూది బుధవారం ఉదయం జరిగే దివ్య బలి పూజతో ఈ తపస్సు కాలం ప్రారంభమవుతుందన్నారు. ప్రతి బుధవారం, శుక్రవారం దేవాలయ ప్రాంగణంలో శిలువ మార్గం ఉంటుందని అలాగే ప్రతిరోజు తపస్సు కాల ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విచారణ కేంద్రం మచిలీపట్నంతో పాటు విచారణ పరిధిలో గల 15 సంఘాలలో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఏప్రిల్ 4 నుంచి 6 వరకు మూడు రోజులు పాటు మచిలీపట్నం విచారణ ప్రాంగణంలో పవిత్రాత్మ ప్రార్ధనా సమావేశాలు జరుగుతాయని ఈ సమావేశాలకు బాపట్ల నుంచి ఫాదర్ డి సామయేలు హాజరవుతారని తెలిపారు. ఈనెల 10 నుంచి ఏప్రిల్ 8 వరకు విచారణ పరిధిలో గల 15 సంఘాలలో దివ్య బలి పూజలు, సిలువ మార్గాలు నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 13న మ్రానికొమ్మల ఆదివారంను ఘనంగా జరుపుకుంటామని అలాగే ఏప్రిల్ 18న పవిత్ర శుక్రవారం (గుడ్ ఫ్రైడే) సందర్భంగా బందరు పురవీధులలో పరిశుద్ధ బహిరంగ సిలువ మార్గం నిర్వహించడం జరుగుతుందన్నారు. 19 వ తేదీ పవిత్ర శనివారం రాత్రి పాస్కా జాగరణ,20న ఈస్టర్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవడానికి క్రైస్తవ విశ్వాసులు సమాయత్తం కావాలని ఫాదర్ డేవిడ్ రాజు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## సీపీని మర్యాద పూర్వకంగా కలిసిన

# ఎన్.టి.ఆర్. జిల్లాకు కేటాయించబడిన నూతన ప్రొబేషనరీ ఎస్ఐలు



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్:** అనంతపురం పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఎన్.టి.ఆర్.జిల్లా పోలీసు కమిషనరేట్ కు కేటాయించిన 56 మంది ప్రొబేషనరీ ఎస్.ఐ.లు సోమవారం పోలీసు కమిషనర్ కార్యాలయంలో నగర పోలీస్ కమిషనర్ ఎస్. వి. రాజశేఖర బాబుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనేపథ్యంలో నగర పోలీసు కమిషనర్ నూతనంగా పోలీస్ శాఖలోకి అడుగుపెడుతున్న ప్రొబేషనరీ ఎస్సైలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా, క్రమశిక్షణ, నిజాయతీ, పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, బాధితులకు న్యాయం, ముద్దాయిలకు శిక్షలు కల్పించేలా పని చేయాలని సూచించారు. ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తూ, పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా విధులను నిర్వర్తించాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ వీధి నిర్వహణలో టెక్నాలజీ ని ఉపయోగించి ఉత్తమ ఫలితాలను రాబట్టి ప్రజలకు మరింత సేవ చేసేలాగా చూడాలని, పి.జి.ఆర్.ఎస్. ఫిర్యాదులను అప్లోడ్ చేయు విధానం, ఎఫ్.ఐ.ఆర్., ధర్యాప్తుకు సంబందించిన రికార్డులను రాయడం గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలి, కేసులను ఏవిధంగా చేధించాలి, సి.సి.టి.ఎన్.ఎస్., డ్రోన్స్ ను ఉపయోగించడం, క్లౌడ్ పెట్రోలింగ్, సి.సి.కెమెరాలను ఉపయోగించు విధానం గురించి, అస్త్రం యాప్ గురించి, ఈ పహరా బీట్ గురించి, ఎన్.డి.పి.ఎస్. కేసులలో చేయవలసిన విధుల గురించి, కేసు డైరీ రాయడం, నేర స్థలాన్ని ఏవిధంగా పరిశోధించాలి, బంధోబస్త్ ఏవిధంగా వేయాలి, ఏ విధంగా నిర్వహించాలి, పోలీస్ స్టేషన్ నిర్వహణ, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్లో నిర్వహిస్తున్న వివిధ క్రైమ్ రికార్డ్స్ లను ఏ విధంగా నిర్వహించాలి మొదలగు అంశాల గురించి క్షుణ్ణంగా నేర్చుకోవాలని, ఎక్కడా ఏవిధమైన అనుమానం వచ్చిన వెంటనే సీనియర్ అదికారులను అడిగి తెలుసుకుని నివృత్తి చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి.లు గౌతమి షాలి, తిరుమలేశ్వర రెడ్డి, కె.జి.వి. సరిత, ఏ.బి.టి.ఎస్. ఉదయారాణి, కృష్ణ మూర్తి నాయుడు, ఎస్.వి.డి.ప్రసాద్, గుణ్ణం రామకృష్ణ, ఏ.ఆర్.ఏ.సి.పి. డి.ప్రసాద రావు, నూతన ప్రొబేషనరీ ఎస్.ఐ.లు పాల్గొన్నారు.





# తడి పొడి చెత్త సేకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

### జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో తడి పొడి చెత్త సేకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.
సోమవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, జిల్లా పంచాయతీ అధికారులతో తడి పొడి చెత్త సేకరణ, ఎమ్మెస్ ఎంఈ సర్వే పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంకా కొంత మంది తడి పొడి చెత్తను వేరు వేరుగా కాకుండా కలిపే ఇస్తున్నారని, దీనిపై పారిశుద్ధ్య సిబ్బందికి కూడా అవగాహన లేనట్లుగా కనిపిస్తోందని, ప్రజలతోపాటు సిబ్బందికి తగిన అవగాహన కల్పించాలన్నారు. తాను నగరంతో పాటు జిల్లా లోని ఇతర ప్రాంతాలలో తడి పొడి చెత్త సేకరణపై ఆకస్మిక తనిఖీలు చేపట్టినప్పుడు మాత్రమే అధికారులు, పారిశుధ్య నిర్వహణ సిబ్బంది స్పందిస్తున్నారని, మిగతా సమయాలలో దృష్టి పెట్టడం లేదన్నారు. ఈ పద్ధతిని విడనాడి స్వచ్ఛ జిల్లా దిశగా తీర్చిదిద్దేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఎంఎస్ఎంఈ సర్వే పురోగతిపై ఆయన మున్సిపాలిటీలు, మండలాల వారీగా సమీక్షిస్తూ, వ్యాపార యజమానుల చిరునామాలను గుర్తించేందుకు విద్యుత్ శాఖ ద్వారా జియో కోఆర్డినేట్ పరికరాలను సిబ్బందికి అందించినప్పటికీ సర్వేను ముందుకు తీసుకువెళ్లడంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు శ్రద్ధ పెట్టడం లేదని అసహనం వ్యక్తం చేశారు. రాబోయే రెండు మూడు రోజుల్లో సరైన ప్రణాళికతో ముందుకు సాగి సర్వేను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

# శాసనమండలిలో ఖాళీ అవుతున్న రెండు యాదవ స్థానాలు యాదవులకే ఇవ్వాలి

### అఖిల భారత యాదవ మహాసభ జనరల్ సెక్రెటరీ పెద్ది బోయిన శ్రీనివాస్ యాదవ్



**విజయవాడ మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలిలో ప్రస్తుతం ఖాళీ అవుతున్న 5 స్థానాలలో రెండు స్థానాలు (యనమల రామకృష్ణుడు, జంగా కృష్ణమూర్తి ) యాదవులు ప్రాతినిధ్యం వహిస్తున్నవని, ఆ స్థానాలు తిరిగి యాదవులకే కేటాయించాలని సోమవారం అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని సీతారాంపురంలో జరిగిన అఖిల భారత యాదవ మహాసభ, విజయవాడ నగర నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అత్యధిక శాతం యాదవులు మద్దతు తెలపడం ఒక ముఖ్య కారణం కాగా, ఆది నుండి బీసీ లలో అత్యదిక జనాభా కలిగిన యాదవులు తెలుగుదేశం పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న విషయం పార్టీ నాయకత్వము గుర్తు పెట్టుకోవాలని పెద్ది బోయిన కోరారు. టిడిపి పార్టీకి తమ యాదవ సంఘీయులు అందించిన సేవలు, అందిస్తున్న కొత్త పాత యాదవ నాయకులు ఏంతో మంది శాసనమండలి స్థానం పై ఆశాభావంతో ఉన్నారన్నారు. దామాషా ప్రకారం చట్ట సభల్లో సీట్లు ఎలాగో ఇవ్వడం లేదు, ఖాళీ అవుతున్న మా స్థానాలనే పార్టీలో క్రియాశీలకంగా ఉన్న, పార్టీ విజయానికి సహకరించిన టిడిపి యాదవ నేతలకు కేటాయించాలని తమ డిమాండ్ సమంజసమని పెద్ది బోయిన పేర్కొన్నారు. అంతే కాక ప్రత్యేకంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో అప్పటి శాసనమండలి సభ్యులు బచ్చుల అర్జునుడు ఆకస్మిక మరణం తర్వాత జిల్లాలో ఇంకో యాదవునికి అవకాశం ఇవ్వాల్సిన బాధ్యత తెలుగుదేశం ప్రభుత్వం మీద ఖచ్చితంగా ఉందన్నారు..కానీ అప్పుడు అలా జరగలేదన్నారు. కనీసం ఇప్పుడైనా భర్తీ చేయాలనుకుంటున్న 5 ఎమ్మెల్సీ స్థానాలలో యాదవ్ జాతి నుంచి ఉన్న టిడిపి నేతలకు ఇవ్వాలని ఆయన కోరారు. అదేవిధంగా నామినేటెడ్ పదవులను ఇచ్చి పార్టీ లో కష్టపడ్డ యాదవులకు న్యాయం చేయాలని, యాదవులకు సముచిత స్థానం కల్పించాలని,యాదవ కార్పోరేషన్ కి వెయ్యి కోట్లు నిధులు కేటాయించాలని, రాజధాని ప్రాంతంలో “యాదవ భవన్” నిర్మాణానికి స్థలం కేటాయించాలని సంఘాలకు అతీతంగా తెలుగుదేశం అధిష్టానాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పార్టి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావుకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర నాయకులు చెవుల ఆంజనేయులు యాదవ్ పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ నాయకులు బట్ట సాంబశివ రావు యాదవ్, దాసరి రామకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.



# రక్తహీనత నిర్మూలనే ధ్యేయంగా కృషి చేయాలి


### యువతులు పోషకాహారం తీసుకోవాలి

### గర్భిణీలు, చిన్నారులకు పోషకవిలువలతో కూడిన ఆహారాన్ని అందించాలి

### ప్రతి ఒక్కరు ఆహార విషయంలో జాగ్రతలు తీసుకోవాలి లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ల లీలారాణి

**విశాఖపట్నం, మేజర్ న్యూస్ :** యువతులు,చిన్నారులు అహారంలో పోషకాలతో కూడిన పదార్ధాలు ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని, రక్తహీనత నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ముఖ్యంగా గర్భిణీలు నిత్యం పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని లీ ఫార్మా లిమిటెడ్ డైరెక్టర్ ఆళ్ల లీలారాణి పిలుపునిచ్చారు. అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా లీ ఫార్మా లిమిటెడ్ సంస్థ అద్వర్యంలో రఘు ఫార్మసీ కాలేజిలో సుమారు 250 పైగా యువతులకు రక్తహీనత పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. రక్తబలహీనతలను ఎలా అధికమించాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ల లీలారాణి మాట్లాడుతూ రక్తహీనతపై పెద్దఎత్తున ప్రచారం కల్పించాలని,రోజు వారిగా మనం తినే ఆహారంలో తప్పని సరిగా పోషకవిలువలు ఉండే విధంగా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జయలక్ష్మి, సరోజిని, లీ ఫార్మా సిబ్బంది పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలకు పార్థసారథి భౌతిక కాయం దానం



**చల్లపలి&, మేజర్ న్యూస్ :** మోపిదేవి మండలం పెద్దకళ్లేపల్లి గ్రామ ప్రముఖులు గొర్రెపాటి పార్థసారధి (85) భౌతికకాయాన్ని మెడికల్ కళాశాలకు దానం చేశారు. ఆదివారం రాత్రి పార్థసారధి మృతి చెందగా, ఆయన పార్థీవ దేహాన్ని వారి కుమారుడు గొర్రెపాటి రమేష్ చంద్రబాబు మెడికల్ కళాశాలకు దానం చేశారు. నేత్రాల కార్నియాలను తాడిగడప ఎల్.వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు దానం చేయగా ఆసుపత్రి సిబ్బంది వచ్చి నేత్రాల నుంచి కార్నియాలు సేకరించి తరలించారు. భౌతిక కాయాన్ని ఇబ్రహీంపట్నం నిమ్రా మెడికల్ కళాశాల వారికి దానం చేశారు.
**సంతాపం :** పార్థసారధి మృతి పట్ల ప్రవాస భారతీయులు, గొర్రెపాటి విద్యా ట్రస్ట్ చైర్మన్ గొర్రెపాటి రంగనాథబాబు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్, విజయా అకాడమీ కరస్పాండెంట్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా అమెరికా నుంచి ప్రవాస భారతీయులు, గొర్రెపాటి విద్యా ట్రస్ట్ చైర్మన్ గొర్రెపాటి రంగనాధబాబు ఫోన్ ద్వారా వారి కుమారునితో మాట్లాడి సంతాపం తెలిపారు. పార్థసారధి తన క్లాస్ మెట్‌గా తనతో కలిసి చదువుకున్నారని, ఆయనతో ఉన్న సాన్నిహిత్యం స్మరించుకున్నారు.

# కంది సాగులో యాంత్రీకరణ ఆవశ్యకతకు గుర్తింపు




విజయవాడ, మేజర్ న్యూస్ : సోమవారం విజయవాడలో కంది సాగుపై రాష్ట్ర స్థాయి కార్యశాల జరిగింది .ఈ కార్యశాల లో కందిసాగు ఎక్కువగా వున్న 7 జిల్లాల నుండి రైతులు,ఎగుమతి దారులు,పప్పుల మిల్లు యజమానులు,వ్యవసాయ అధికారులు,ఆచార్య ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త లతో రాబోవు ఖరీఫ్ సీజన్లో కంది సాగులో,గత అనుభవాలను దృష్టిలో వుంచుకుని,చేపట్టాల్సిన కార్యాచరణ పై సుదీర్ఘంగా చర్చించారు. రైతులు,పప్పు మిల్లుల యజమానులు మాట్లాడుతూ పసుపు రంగు కందులకు డిమాండ్ ఎక్కువగా వున్నదని తెలుపుతూ, మనుషుల ద్వారా పంట కోతకు సుమారు రూ.9500ల ఎకరానికి ఖర్చు అవుతుంది అని,అదే మెషీన్ ద్వారా కోతకు కేవలం రూ.3500 లోపు ఖర్చుఅవుతున్నది అని తెలిపారు. కానీ మెషీన్ల ద్వారా కోతలు, నూర్పిడులు చేస్తున్నప్పుడు,పూర్తిగా పక్వానికి రాని గ్రీన్ పీస్,గింజలలో పొట్టు పోకుండా పొట్టు బద్ద,తెల్ల మచ్చలు తదితర మిశ్రమం (అడ్మిక్చర్స్) లు కలిసి,వాటి ద్వారా సోర్టెక్స్‌లో నాణ్యత ప్రమాణాలు తగ్గి రేటు తగ్గి పోతుందని తెలిపారు.
కూలీల కొరత దృష్ట్యా,కంది సాగులో విత్తటం దగ్గర నుండి కోత వరకు యాంత్రీకరణ ను ప్రవేశ పెట్టాలని కోరారు .కోత మెషీన్లు,అన్ని పంటలకు ఒకే రకమైన ప్లేట్లను వాడటం వల్ల, రోలర్లను మార్చక పోవడం వల్ల గింజలలో ముక్కలుగా బ్రోకెన్లు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. డాక్టర్ మోహన రెడ్డి,ప్రధాన శాస్త్రవేత్త,లామ్ పరిశోధన స్థానం మాట్లాడుతూ కంది విత్త టానికి జూన్ 15 నుండి ఆగస్టు 15 వరకు అనుకూల మైన సమయమని తెలుపుతూ,జూన్ మాసంలో విత్తు కుంటే సాలు కు సాలుకు దూరం 6 అడుగులు బీబీ జూలై లో విత్తు కుంటే 5 అడుగులు బీబీ ఆగస్టులో విత్తుకుంటే 4 అడుగుల నిడివి వుండేలా చూసుకోవాలని తెలిపారు. కందిలో అంతర పంట గా వేరుశనగ కు 1: 7 నిష్పత్తిలో,జొన్న /మొక్కజొన్న కు 1: 2 నిష్పత్తిలో వేయాలని,తద్వారా ట్రాక్టర్ సేద్యపు అంతర కృషి కి అవకాశం ఉంటుంది అని తెలిపారు. రైతుల ప్రశ్నలకు డిల్లీ రావు మాట్లాడుతూ అన్ని ప్రాంతాలకు అనువైన యల్ ఆర్ జీ 52 రకంపై మరింత పరిశోధన చేస్తామని,ప్రతి ఎకరానికి సరాసరి దిగుబడి 4 నుండి 5 క్వింటాళ్ల వుండేలా,3.70 లక్షల హెక్టార్ల విస్తీర్ణం నకు 3.50 లక్షల టన్నుల ఉత్పత్తి నీ రాబోవు ఖరీఫ్ 25 కు లక్ష్యముగా పెట్టుకున్నా మని తెలిపారు. డాక్టర్ సతీష్, డైరెక్టర్, ఏపీ విత్తన ధ్రువీకరణ సంస్థ వారు మాట్లాడుతూ కందిలో ఎండు తెగులు సోకకుండా,ట్రైకోడర్మ విరిడి జీవ శిలీంధ్ర నాశిని ను విత్తనానికి పట్టించడం,నేలలో జల్లడం ద్వారా ఎండుతెగులును వ్యాప్తిని తగ్గించ వచ్చని తెలిపారు. ఈ కార్యక్రమములో శాస్త్రవేత్తలు శివా రెడ్డి,ప్రతిభ రాణి,సాంబశివ రావు,ఏడుకొండలు వివిధ అంశములపై చర్చించారు. డిప్యూటీ డైరెక్టర్ యన్. సి.బాలు నాయక్ వందన సమర్పణ చేశారు.



# బార్బీక్యూలో మటన్ ప్రియులకు ప్రత్యేక ఉత్సవం



**విజయవాడ, మార్చి 3, మేజర్ న్యూస్ :** మటన్ ప్రియుల జిహ్వా చాపల్యాన్ని తీర్చేందుకు బార్బీక్యూ నేషన్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 'లజీజ్-ఈ-గోశ్త్' పేరుతో ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభించామని బార్బీక్యూ నేషన్ హాస్పిటాలిటీ లిమిటెడ్ సీడీవో మాన్సూర్ మెమోన్, ఆంధ్ర హెడ్ నరేష్ నాయుడు తెలిపారు. సోమవారం విజయవాడ బందరు రోడ్డులోని ఎల్ఈపీఎల్ సెం ట్రల్ మాల్‌లోని బర్బీక్యూ నేషన్‌లో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఫుడ్ ఫెస్టివల్ మార్చి 3 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఈ విందులో మటన్ ప్రియులకు అరుదైన వంటకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ విందు మటన్ మారగ్ సూప్తో ప్రారంభమవుతుందన్నారు. స్టార్టర్స్‌లో ఖీమా కలేజి, మటన్ ఖీమా పావ్, గలౌటీ కబాబ్, మటన్ శేఖావతి సీఖ్, మటన్ రాన్ వంటి స్పెషల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రధాన వంటకాలలో మృదువైన మసాలాలతో హైదరాబాదీ మటన్ హాలీం, నిహారి గోశ్త్, షాహీ మటన్ ఖోర్మా, హైదరాబాదీ జాఫ్రాని మటన్ దమ్ బిర్యానీ వంటి రుచులను ఆస్వాదించవచ్చని తెలిపారు. ఈ విందును అత్యంత మధురంగా ముగించేందుకు ఫ్రూట్ కస్టర్డ్ (పాలు, కస్టర్డ్ పౌడర్, తాజా పండ్లతో చేసిన క్రీమీ డెజర్ట్), షీర్ ఖుర్మా (తాజా పాలతో, సేమియాతో తయారైన సంప్రదాయ స్వీట్) వంటి రుచికరమైన మిఠాయిలు కలవన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన కేసర పిస్తా కుల్ఫీ, హనీ ఆల్మండ్ & డేట్స్ కుల్ఫీ వంటి కుల్ఫీలు ఈ విందుకు మరింత విశిష్టతను ఇస్తాయన్నారు. బార్బీక్యూ నేషన్ ప్రత్యేకతను ప్రతిబింబిస్తూ.. రెస్టారెంట్ మంత్రముగ్ధంగా అలంకరించబడిందన్నారు. ఈ ఫెస్టివల్ అనుభూతిని పెంచేందుకు థీమ్‌కు అనుగుణంగా వేషధారణలో ఉన్న సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన వినోద కార్యక్రమాలు కూడా భోజన అనుభూతిని మరింత ఆనందదాయకంగా మార్చుతాయని తెలిపారు. ఈ ఫుడ్ ఫెస్టివల్ ద్వారా అతిథులకు విభిన్నమైన, తాజాదనంతో కూడిన డైనింగ్ అనుభూతిని అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. మా ప్రత్యేక వంటకాలను కొనసాగిస్తూ మటన్ ప్రియులకు ఓ కొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మరిన్ని వివరాలు, రిజర్వేషన్ కోసం https://www.barbequenation.com సంప్రదించాలని కోరారు.

**మటన్ రుచుల విందు 'లజీజ్-ఈ-గోశ్త్'**

**ఈ ఫెస్టివల్ మార్చి 3 నుంచి ఏప్రిల్ 6 వరకు..**



# మొత్తం ఇద్దరు పిల్లలను రెస్క్యూ చేసిన ఎన్.టి.ఆర్. జిల్లా పోలీసులు





**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** నగర పోలీస్ కమిషనర్ ఎస్. వి. రాజా శేఖర బాబుకి రాబడిన పక్కా సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ ఏ.డి.సి.పి ఏ. శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఏ.సి.పి. కె.లతా కుమారి, నార్త్ ఏ.సి.పి. స్రవంతి రాయ్ ఆధ్వర్యం లో టాస్క్ ఫోర్స్, నున్న ఇన్స్పెక్టర్లు వారి సిబ్బందితో కలిసి మార్చి 1న సులభంగా డబ్బులు సంపాదించడం కోసం పిల్లలు లేని వారిని/ సంతానలేమితో బాధపడుతున్న వారిని లక్ష్యంగా చేసుకుని అక్రమంగా చిన్న పిల్లలను విక్రయించు ఐదుగురు మహిళలను అదుపులోనికి తీసుకుని విచా రించి వారి వద్ద నుండి విక్రయించడానికి ఉంచిన ముగ్గురు పిల్లలను స్వాధీ నం చేసుకుని అరెస్ట్ చేసిన సంగతి విధితమే. ఈ క్రమంలో నిన్న ఒక పాపను రెస్క్యూ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఏ.సి.పి. కె.లతాకుమారి ఆధ్వ ర్యంలో టాస్క్ ఫోర్స్, మహిళా పోలీస్ స్టేషన్ అధికారులు సిబ్బందితో కలిసి పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు, నర్సీపట్నం ఏరియాలలో నిందితులు విక్రయించిన ఇద్దరు మగ పిల్లలను రెస్క్యూ చేసి ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్ట్మెంట్ వారికి అప్పగించారు.

# సుగాలి ప్రీతిపై పాటను ఆవిష్కరించిన న్యూ హోప్ ఫౌండేషన్

## ముఖ్యఅతిథిగా విచ్చేసిన జడ శ్రావణ్ కుమార్



**విజయవాడ, మార్చి 3, మేజర్ న్యూస్ :** 2017 టిడిపి ప్రభుత్వంలో దారుణ హత్యకు గురయిన గిరిజన బాలిక సుగాలి ప్రీతి పై విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఓ పాటను న్యూ హోప్ ఫౌండేషన్ సభ్యులు ఆవిష్కరించారు. ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జైభీమ్ రావ్ భారత్ పార్టీ వ్యవస్థాపకులు,హైకోర్టు ప్రముఖ న్యాయవాది జడ శ్రావణ్ పాల్గొన్నారు. ముందుగా న్యూ హోప్ ఫౌండేషన్ సభ్యులతో కలిసి జడ శ్రావణ్ పాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జడ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ 2017 టిడిపి ప్రభుత్వంలో సుగాలి ప్రీతి అత్యంత కిరాతకంగా, దారుణంగా హత్యకు గురయితే ఇప్పటి వరకు సుగాలి ప్రీతి కుటుంబానికి న్యాయం దక్కకపోవడం బాధాకరం అన్నారు. ఎన్నికల సమయంలో పవన్ కల్యాణ్ సుగాలి ప్రీతి హత్య పై కొన్ని వందల సార్లు మాట్లాడారని, ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఎన్నో మాట్లాడారని దుయ్యబట్టారు. 2017లో హత్యకు సుగాలి ప్రీతి హత్యకు గురైతే 2020లో వైసిపి ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించిందని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా విచారణ ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదని జడ శ్రావణ్ అన్నారు. ఎన్నికల సమయంలో కొన్ని వందల సార్లు సుగాలి ప్రీతి హత్యపై మాట్లాడిన పవన్... అధికారంలోకి వచ్చాక ఎందుకు మౌనంగా ఉన్నారో అర్థం కావడం లేదన్నారు. సినిమాలో డైలాగులు మరిచిపోయినట్లు పవన్ సుగాలి ప్రీతి కేసును మరిచిపోయినట్టున్నారని అన్నారు. పవన్ కళ్యాణ్ కు నిబద్ధత, నిలకడ లేదని జడ శ్రావణ్ దుయ్యబట్టారు. కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీ పెద్దలతో మాట్లాడి పవన్ సుగాలి ప్రీతి కేసును సీబీఐ తో దర్యాప్తు చేయించవచ్చు కదా అంటూ ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వం సుగాలి కుటుంబానికి ఉద్యోగం, 5 ఎకరాలు పొలం ఇచ్చిందని, తాను సుగాలి ప్రీతి కుటుంబం కోసం పోరాడా నని జడ శ్రావణ్ వాపోయారు. న్యూ హోప్ ఫౌండేషన్ రచించిన పాటతో ప్రతి ఒక్కరూ కదిలిరావాలని, ప్రీతి కుటుంబానికి న్యాయం జరగాలని జడ శ్రావణ్ కోరారు. అనంతరం న్యూ హోప్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ మంచా నాగమల్లేశ్వరి, ప్రముఖ గాయకుడు రేజెండ్ల రాజేష్, సినీ మ్యూజిక్ డైరెక్టర్ నందన్ రాజు బొబ్బిలి మాట్లాడుతూ...ఈనెల 8 న మహిళా దినోత్సవం రోజున పాటను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మహిళలు, యువతులపై జరుగుతున్న ఆకృత్యాలు, అఘాయిత్యాలు కలచి వేస్తున్నాయని, అలాంటి ఆవేదనలో పుట్టుకొచ్చింది సు గాలి ప్రీతి పాటని తెలిపారు. సుగాలి ప్రీతి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ ప్రతి ఒక్కరూ ప్రీతి కుటుంబానికి అండగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో జైభీమ్ రావు భారత్ పార్టీ ప్రధాన కార్యదర్శి పరసా సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోండి

## నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాలు



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం ఉదయం శాఖధిపతులు, సచివాలయ సిబ్బందితో టెలికాన్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సానిటేషన్, ప్లానింగ్, ఎమినిటీ సెక్రటరీలు సమన్వయంతో పని చేయాలని, ఎమినిటీస్ అందరూ సకాలంలో పన్నులు వసూలు చేయాలని, ఒక సచివాలయం పరిధిలో ఎటువంటి సమస్య ఉన్న వెంటనే స్పందించి పరిష్కరించాలని, అధికారులు ఎప్పుడు వారిని పర్యవేక్షిస్తూ వారికి కావలసిన సహకారాన్ని ఎల్లప్పుడూ అందించాలన్నారు. ఫీల్డ్ లెవెల్‌లో ఉన్న ప్రతి చిన్న సమస్యను క్షుణ్ణంగా గమనించి అధికారులకు తెలియ జేసి తగిన చర్యలు పరిష్కారాన్ని అందించాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బం ది కలగకుండా చూసుకోవాలని కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు.

# నీరుకొండ చేసిన సేవలు ఆమరణీయం



**నందిగామ, మార్చి 3, మేజర్ న్యూస్ :** ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, విశ్రాంత ఉపాధ్యాయులు నీరుకొండ నరసింహారావు ఎస్టియు కు చేసిన సేవలు ఆమరణీయమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు సోమవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ హోమ్ మినిస్టర్ వసంత ఆ నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణకుమారిలతో కలిసి కామ్రేడ్ నీరుకొండ నరసింహారావు శతదిన కార్యక్రమంలో వారు పాల్గొని, ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షులు విశ్రాంత ఉపాధ్యాయులు నీరుకొండ నరసింహారావు చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్టియు రాష్ట్ర మాజీ అధ్యక్షులు, విశ్రాంత ఉపాధ్యాయులు నీరుకొండ నరసింహారావు ఎస్టియుకు చేసిన సేవలు ఆమరణీయమని అన్నారు. మంచి ఉపాధ్యాయుని కోల్పోయామని పేర్కొన్నారు ఎస్టియు అభివృద్ధిలో వారు చేసిన సేవలను గుర్తు చేసుకొని కొనియాడారు కామ్రేడ్ నీరుకొండకు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చుండూరు సుబ్బారావు, నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండల కృష్ణకుమారి, ఎస్టియు నూతన కార్యవర్గ సభ్యులు, పలువురు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక విజయ క్రాంతి జూనియర్ కళాశాల, విజయ జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. క్రాంతి కళాశాలలలో 312 మంది, విజయ జూనియర్ కళాశాలలో 260 మంది మొత్తం 572 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 8మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్లుగా శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావులు వ్యవహరించారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో

ఫోన్ : 9642 980 999